క్లుప్తంగా

రవీంద్రనాథ్‌కు డాక్టరేట్



నెల్లికుదురు : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన చందపాక రవీంద్రనాథ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రవీంద్రనాథ్ వాణిజ్య విభాగంలో ప్రొఫెసర్ ఎస్.కవితాదేవి పర్యవేక్షణలో ఆర్థిక అక్షరాస్యతపై ఒక అధ్యయనం, మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామీణ గృహాలు, పట్టణ గృహాల మధ్య తులనాత్మక అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేశాడు. డాక్టరేట్ పొందిన రవీంద్రనాథ్‌ను తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

నేలవాలిన మిర్చితోట



గార్ల : మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మిర్చితోటలు నేలమట్టమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన రైతు ఇమ్మడి గోవింద్ సాగు చేసిన 2 ఎకరాల మిర్చితోట ఈదురు గాలులు, వర్షానికి పూర్తిగా నేలవాలింది. సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు దెబ్బతిన్న తోటను సర్వే చేసి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు గోవింద్ కోరుతున్నాడు.

మిత్రుల చేయూత



చిన్నగూడూరు : మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన ఉప్పోజు వెంకటాచారి సతీమణి వసంత ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న 1992–93 జెడ్పీఎస్ఎస్ ఎల్లంపేట పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వెంకటాచారి బాల్యమిత్రులు గురువారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. జర్పుల కాలునాయక్, పోడేటి వెంకన్న, కారంపూడి నర్సయ్య, గండి పరమేష్, శ్రీశైలం, ఉపేందర్, అశోక్, వీరన్న, హుస్సేన్, భావుసింగ్, జ్యోతి, పద్మ ఉన్నారు.

ఆర్థికసాయం



గూడూరు: మండల కేంద్రానికి చెందిన శివాలయ పూజారి సతీష్‌పాండ్యే కుమార్తె అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సేవికా సమితి ప్రతినిధులు గురువారం రూ.7,510 బాధిత కుటువబ సభ్యులకు అందించారు. సభ్యులు పింగిళి స్వరూపారాణి, జూలూరి పావనితో పాటు 30 మంది మహిళల ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నర్సింహులపేట : మండలంలోని బంజర గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ వైర్ తెగడంతో సమీపంలో ఉన్న గేదె వైరుకు తాకి మృతి చెందింది. సుమారుగా రూ.60 వేల విలువ గల గేదె మృతిచెందిందని, నష్టపరిహారం ఇవ్వాలని రైతు వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి పశు వైద్యాధికారి సౌమ్య వెళ్లి పరిశీలించారు.

అధిక ఫీజు వసూలు ?

మహబూబాబాద్ అర్బన్ : పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు రూ.120 ఉంటే విద్యార్థుల నుంచి రూ.350 అధికంగా వసూలు చేసిన సంఘటన మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో సుమారు 99 మంది బాలికలు పదో తరగతి చదువుతున్నారు. హెచ్‌ఎం ఒక్కో విద్యార్థి నుంచి పదో తరగతి ఫీజు రూ.350 చెల్లించాలంటూ వసూలు చేశారు. విద్యార్థి తల్లిదండ్రులు పదో తరగతి ఫీజుపై హెచ్‌ఎంను ప్రశ్నిస్తే మీకు తెలుసా.. మాకు తెలుసా అంటూ, ఆన్‌లైన్ ఫీజులు ఉంటాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్)ల విలీన మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీల విలీన కార్యక్రమానికి ఐక్యత చర్చల ఫలితంగా విలీనం చేసేందుకు మూడు పార్టీల ఉమ్మడి సమావేశంలో నిర్ణయించనట్లు తెలిపారు. పీడిత ప్రజలను ఐక్యం చేస్తూ వర్గ పోరాటాలను తీవ్రతరం చేసేందుకు విప్లవ పార్టీలు ఏకమవుతున్నాయని పేర్కొన్నారు. 2024 మార్చి 4, 5 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో బహిరంగ సభ, 14 రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులతో మహాసభలను జరగనున్నాయని ఆయన తెలిపారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?

- సిగ్నల్‌తండాకు తప్పని దారి కష్టాలు
- ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన పనులు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు



నీరు నిలిచి బురదమయమైన సిగ్నల్‌తండా రోడ్డు

డోర్నకల్ : రోడ్డు పనులు పూర్తికాక పోవడంతో గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు.. భూ వివాదం కారణంగా రోడ్డు నిర్మాణపనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అయితే ఇటీవల ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు కాగా ఎలక్షన్ కోడ్‌తో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం మిచాంగ్ తుపాన్ ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.. అయితే తండావాసులు నడిచి వెళ్లేందుకు సైతం వీలు లేకుండా రోడ్డంతా బురదమయంగా మారింది. అడుగు తీసి అడుగు వేయని పరిస్థితి నెలకొంది. డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని సిగ్నల్ తండాకు మెరుగైన రోడ్డు లేక తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తండా చుట్టూ రైలు పట్టాలు ఉండటంతో నేరుగా దారి లేక తండావాసులు నానా అవస్థలు పడుతున్నారు. లాలితండా, మంగ్యాతండా, చిమ్నాతండాతో కలిసి ఉన్న సిగ్నల్ తండాలో సుమారు 150 ఇళ్లు ఉన్నాయి. రవీంద్ర నాయక్ ఎంపీగా పని చేసిన కాలంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. అనంతరం వాంకుడోత్ సుజాత ఎంపీపీగా పని చేసి ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టగా భూ వివాదంతో రోడ్డు పనులు ఆగిపోయాయి. ఇటీవల ఎన్నికల కోడ్ రావడంతో వారం రోజుల ముందు రూ.52 లక్షల ఐటీడీఏ నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి సిగ్నల్‌తండాకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో మూడు రోజులుగా వర్షాలు పడటంతో సిగ్నల్‌తండా వైపు నడవడానికి సైతం వీలు లేకుండా బురదమయంగా మారింది. రోడ్డు పనులు నిలిచి బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నామని స్థానిక తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ / మహబూబాబాద్ అర్బన్: అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లులు నిలిపివేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం మిషన్ భగీరథ పనులు, అభివృద్ధి పనులపై చైర్మన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆతర్వాత 11వ వార్డులో, గాంధీపురంలో డంపింగ్ యార్డును సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేయాలన్నారు. కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



గార్ల: సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రియ

గార్ల /బయ్యారం : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. గురువారం గార్ల లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందుతో కలిసి ఆమె మాట్లాడారు. ఇల్లందు ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సుమారు రూ.500 కోట్లు మంజూరై ఉన్నాయని, ఆ నిధులతో ఎమ్మెల్యే కనకయ్య పనులు చేపట్టాలని ఆమె కోరారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. మరో 5 ఏళ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్‌లు ఆర్.శంకర్, బి.శ్రీను, బుడిగ మురళి, ఆలయ కమిటీ చైర్మన్ బి.అమర్‌చంద్, ఎం.భాస్కర్‌రావు, కోట ఉత్తరయ్య, కట్టా రమేష్, ఎం.కొమరయ్య, నరసింహ, ఉమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి..

కురవి : బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా ఉంటామని జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో లేదని అధైర్యపడొద్దని, ప్రతిపక్షంలో ఉండి పేదలకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోడు శ్రీను, జంగిలిహరిప్రసాద్, జీవన్, వినోద్, నాయకులు నరహరి, బాదె నాగన్న, గుగులోత్ నెహ్రూనాయక్, అల్లూరి కిశోర్‌వర్మ, హచ్చ నాయక్, జానీ, అర్జున్ చౌహాన్, కిషన్, వినోద్ పాల్గొన్నారు.

రామచంద్రు ఆశయాలను నెరవేరుద్దాం



మాట్లాడుతున్న విజయసారథి, కిరణ్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ తండా రామచంద్రు సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ఎస్ఆర్ఐ కిరణ్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామంలో రామచంద్రు వర్ధంతి సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బి.విజయసారథి, కిరణ్ రెడ్డి హాజరై మాట్లాడారు. రామచంద్రు పేదల పక్షాన అలుపెరుగని పోరాటాలు ఉద్యమాలు నిర్వహించారని, భూమి లేని పేద రైతుల కోసం భూ పోరాటాలు చేశారని, నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి శ్వాస వరకు పనిచేశారన్నారు. రామచంద్రు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

షోకాజ్ నోటీసు



సాక్షి ఎఫెక్ట్..

చిన్నగూడూరు : మండలంలోని విస్సంపల్లి సర్పంచ్ జీపీ ట్రాక్టర్‌ను తన సొంత పనులకు ఉపయోగించుకుంటున్నాడని ఈ నెల 6న 'సొంత పనులకు జీపీ ట్రాక్టర్' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాగా విస్సంపల్లి సర్పంచ్, కార్యదర్శికి కలెక్టర్ శశాంక షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వనిచో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తక్షణమే చర్యలకు ఆదేశించిన కలెక్టర్‌కు, కథనాన్ని ప్రచురించిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నవీన్‌రావుకు అభినందన

మహబూబాబాద్ : జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి సంస్థ చైర్మన్‌గా గుడిపుడి నవీన్‌రావు ఎంతో కృషి చేసి అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తి చేయించారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి. శ్రీలత అన్నారు. కాగా నవీన్‌రావు రాజీనామా సందర్భంగా ఆయనను పాలకమండలి సభ్యులు వీడ్కోలు, ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ.. నవీన్‌రావు చేసిన అభివృద్ధి గ్రంథాలయ చరిత్రలో మిగిలిపోతుందన్నారు. నవీన్‌రావును సభ్యులుగా పని చేసిన పెద్ది సైదులు, నిమ్మల శ్రీనివాస్ సన్మానించారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం



స్వామివారు, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర బజారులో కొలువైన స్వయంభూ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గద్దె రవి, అధ్యక్షుడు అలుగువెల్లి వీరభద్రం ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను స్థానిక సీతారామచంద్ర స్వామివారి దేవాలయం నుంచి వాయిద్యాల నడుమ పుర వీధుల గుండా ఊరేగింపుగా వేంకటేశ్వర స్వామివారి దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై అలివేలుమంగ, పద్మావతి వేంకటేశ్వర స్వామి వారలను కొలువుదీర్చి అర్చకులు వేద మంత్రాలతో కల్యాణోత్సవం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించిన అనంతరం ఆశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం అలివేలుమంగ, పద్మావతి, వెంకటేశ్వర స్వామి వారిని రథంపై ఊరేగించారు.

ఆడ పిల్లలపై వివక్ష తగదు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అరుణ

మరిపెడ రూరల్ : ఆడ పిల్లలపై వివక్ష తగదని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. మండలంలోని వీరారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 'బేటీ బచావో..బేటీ పడావో' పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నలమాస అరుణ హాజరై మాట్లాడారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఆడపిల్లలకు రక్షణ కరువైందని, వారి పట్ల లింగ వివక్ష చూపుతున్నారని, ముందుగా తల్లిదండ్రులు పిల్లల పట్ల వివక్ష చూపకూడదన్నారు. బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, డయల్–100, 1930 గురించి పిల్లలకు వివరించారు. అనంతరం చిన్నారుల పోషకాహారం, ఫలహారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఆర్.వెంకన్న, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ గంట కవిత, మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సంధ్యారాణి, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టే బిడ్డకు ఆరోగ్యంగా ఉంటుందని కుడియాతండా అంగన్‌వాడీ టీచర్ కుమ్మరికుంట్ల జ్యోతి అన్నారు. మండలంలోని స్టేజీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కుడియాతండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీచర్ మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ పిల్లలకు అనే వివక్ష చూపవద్దన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వార్డు సభ్యురాలు జాటోత్ ప్రమీల, జె.మధు, శ్రీదేవి, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీలను నిలబెట్టుకోవాలి

బయ్యారం : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భద్రునాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బయ్యారంలో విలేకరులతో మాట్లాడారు.

'కేంద్రంలో మరోసారి బీజేపీదే అధికారం'

తొర్రూరు : కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు అన్నారు. పట్టణంలోని పలు వార్డులకు చెందిన యువకులు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారితో పాటు సినీ నటుడు కిన్నెర యాదగిరి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. యువత అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సముచిత స్థానం కల్పించాలి

కేసముద్రం : ప్రొఫెసర్ కోదండరామ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని టీజేఎస్ మండల కన్వీనర్ బాణాల నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి టీజేఎస్ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజు, చాంద్, రమేష్, రోహిత్, మహేష్, గణేష్, జీవిత, ప్రియ, రమ్య, యాస్మిన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు పండ్లు పంపిణీ

కేసముద్రం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు కాంగ్రెస్ పార్టీ ఇనుగుర్తి మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్ పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పోలేపల్లి యాకూబ్‌రెడ్డి, ఎల్లాగౌడ్, మల్సూర్, కిరణ్, రాము, ముఖేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

బయ్యారం : ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యను కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వడ్లమూడి సురేష్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనకయ్యను శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆయనను కోరారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో మహిళ మృతి



భాగ్యలక్ష్మి(ఫైల్)

గూడూరు : మండల కేంద్రానికి చెందిన బాసాని భాగ్యలక్ష్మి(75) గుండెపోటుతో మృతిచెందింది. గురువారం సాయంత్రం భాగ్యలక్ష్మి ఇంటి షట్టర్‌ను కిందకు లాగుతుండగా ఒక్కసారిగా గుండె నొప్పి అంటూ పడిపోయింది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతిచెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు శివాలయంలో పూజలు చేసిన భాగ్యలక్ష్మి ఒక్కసారిగా మృతిచెందడంతో బోరున విలపించారు.

కడుపు నొప్పి భరించలేక..

కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగిన బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని ఏపూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఏపూరుకు చెందిన రాసాల యాకయ్య కుమారుడు రాజేష్(15) నర్సంపేట హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన రాజేష్‌కు కడుపు నొప్పి రాగా ఆస్పత్రిలో చూపించారు. పరిక్షించిన డాక్టర్ అపెండెక్స్‌గా గుర్తించి ఆపరేషన్ చేశాడు. 20 రోజుల క్రితం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుంగా బుధవారం రాత్రి మృతిచెందాడు. బాలుడి తండ్రి యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



భాస్కర్(ఫైల్)

కేసముద్రం : ప్రమాదవశాత్తు గడ్డివామిపై నుంచి పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని మహమూద్‌పట్నంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగెల్లి భాస్కర్(50) గడ్డివామి పై ఎక్కి గడ్డిని పేరుస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కిందపడ్డాడు. గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

డోర్నకల్ : బైపాస్ రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా గురువారం ఆటో బోల్తా పడటంతో పలువురికి గాయాలయ్యాయి. సీరోలుకు చెందిన కొందరు అడవి మద్దెలపల్లి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై ఆటోలో వెళ్తున్నారు. కాగా ఆటోకు కుక్క అడ్డు రావడంతో బ్రేక్ వేయగా బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన ముత్తమ్మ, శ్రీరాములు, శిల్పను 108 వాహనంలో మహబుబాబాద్ ఆస్పత్రికి తరలించారు. వీరితోపాటు ఆటోలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



గూడూరు: సంబురాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు



దంతాలపల్లి: టపాసులు కాలుస్తున్న నాయకులు



మరిపెడ: బాణసంచా కాలుస్తున్న పార్టీ శ్రేణులు



బయ్యారం: గంధంపల్లిలో..



డోర్నకల్: ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గూడూరు : తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో నినాదాలు చేస్తూ బాణసంచా కాల్చారు. అనంతరం చిరు వ్యాపారులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు వాంకుడోత్ కొమ్మాలు నాయక్, శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, అర్రెం వీరస్వామి, ఎండి. రసూల్, శివ, శ్రీహరి, కుమార్, సురేందర్, వీరన్న, హీరాసింగ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగానే మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం సంబురాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు టపాసులు పేల్చి మిఠాయిలు పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపరిపాలన వచ్చిందని, ప్రజలకు ఆమోగ్యమైన పాలన వస్తుందన్నారు. ఈ కార్యాక్రమంలో నాయకులు కోడి శ్రీను, నెల్లురి రవి, రాజేష్, సందీప్, అనిల్, కృష్ణ, నవీన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం : ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. మండలంలోని బయ్యారం, గంధంపల్లి–కొత్తపేట తదితర గ్రామాల్లో నాయకులు బాణసంచాలు కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బయ్యారం పంచాయతీ వార్డు సభ్యులు సత్తిరెడ్డి, కోటయ్య, సొసైటీ డైరెక్టర్లు మల్లయ్య, కేతమల్లు, నాయకులు వెంకట్రామయ్య, రాంబాబు, పంతులు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో..

మరిపెడ : ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై బాణసంచా కాల్చారు. నాయకులు తాజుద్దీన్, అప్సర్, అఫ్జల్, సోమన్న, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, వెంకటరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్ : రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నేరుగా తిలకించేందుకు గాంధీసెంటర్‌లో వాహనానికి బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. గాంధీ సెంటర్‌లో గురువారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, భూక్యా తారాచంద్, మాదా శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, తాళ్లూరి హనుమంతరావు, ఖాదర్‌బాబా, నాగరాజు, మహేష్, భద్రునాయక్ పాల్గొన్నారు.

రెడ్యాలలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ వెన్నం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు గురువారం రాత్రి బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కురవి : మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కురవి, సీరోలు మండలాల్లోని అన్ని గ్రామాల్లో నష్టపోయిన వరితోపాటు ఇతర పంటలను మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ గురువారం పరిశీలించారు. ఏఈఓ బాలాజీ, రైతులు సముద్రాల శ్రీనివాస్, గుగులోత్ రాములు తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం, ఆగపేట, తూర్పుతండా, రామవరం, రామానుజపురం గ్రామాల్లో వరిపంట, కొనుగోలు కేంద్రాలను గురువారం ఏఈఓలు గాడిపల్లి సందీప్, దీక్షిత్‌కుమార్ పరిశీలించారు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట : అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప పంటలను గురువారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఏఈఓలు రామకృష్ణ, కరిష్మ, మౌనిక, పంటలను సందర్శించారు.

మురళీనాయక్‌కు మంత్రివర్గంలో చోటుకల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు గురువారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజా హక్కుల విధ్వంసం జరిగిందన్నారు. ఎమ్మెల్యే తల్లిదండ్రులు మంగ్యానాయక్, దస్మతో రామరాజు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మురళీనాయక్‌ను కలిసిన నేతలు

కేసముద్రం : ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారత్సోవానికి హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు తరాల వీరేష్, రియాజ్, ప్రభురాణి, అల్లం గణేష్‌తోపాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే మురళీనాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.